


## నెలనెలా నవ్వుల పండగ

# మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

### *ఇంకెంతసేపు..!?*

**ఓ సైంటిస్ట్** వజ్రాలు తయారు చెయ్యాలని సంకల్పించి అనేక పరిశోధనలు చేశాడు. ఒకేఒక్క ప్రశ్నకి సమాధానం దొరికితే తన ప్రయత్నాలు ఫలించే స్థితికి చేరుకున్నదతని పరిశోధన. అతను అనేకమందిని ఆ ప్రశ్నడిగితే ఎవరూ జవాబుచెప్పలేకపోయారు. చివరికి ఓ సన్యాసి ఆ సైంటిస్ట్‌కి చెప్పాడు.

"హిమాలయాల్లోని ఉత్తరకాశీలో స్వామిరామ అనే ఆయన ఉన్నారు. ఆయన్నడిగితే ఏ ప్రశ్నకయినా జవాబు చెప్పగలరు."



ఆ సైంటిస్ట్ హిమాలయాల్లోని ఉత్తరకాశీలో ఉన్న స్వామిరామని వెదుక్కుంటూ వెళ్ళాడు. ఆ సమయంలో ఆయన ఆశ్రమంలో లేరు. ఆయన శిష్యురాలుంది. నవయువ్వనవతి అయిన ఆమె సైంటిస్ట్ వచ్చిన పని తెలుసుకుని చెప్పింది.

"స్వామిరామని అడిగే ఏ ప్రశ్న నన్నడిగినా నేను దానికి సమాధానం చెప్పగలను. ఆయన వచ్చేదాకా వేచి ఉండాల్సిన అవసరం లేదు. మీ ప్రశ్నేమిటో నన్నడగండి."

వజ్రాల్లా మెరుస్తున్న ఆమె రెండు కళ్ళల్లోకి చూసి గొంతు తగ్గించి అడిగాడా సైంటిస్ట్ ఆ నవయువ్వనవతిని.

"స్వామిరామ రావడానికి ఇంకా ఎంతసేపు పడుతుంది?"

★★★

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

లేడీస్ క్లబ్ మీటింగులో "క్రిములు – వ్యాధులు" అనే అంశం మీద ఓ సైంటిస్టు ప్రసంగిస్తున్నాడు.

"సూదిమొన మీద వేలకు వేలు సూక్ష్మ క్రిములు జీవించగలుగుతాయి" అంటూ ఉపన్యాసం ప్రారంభించాడు.

"అబ్బ! అవి ఎంత చౌకగా బతుకుతున్నాయో" అని బిగ్గరగా వాపోయింది ఇంటద్దె భరించలేని ఒక ఇల్లాలు.

"బెజవాడలో ఎండ మాడ్చేస్తోందటగా!?"

"అడగాలా! ఆ ఎండలు ఎంత ఎక్కువగా ఉన్నాయంటే ఉడికి పోయిన గుడ్లు పెడతాయేమోనని కోళ్ళకు అయిస్ తినిపిస్తున్నారు."

ఒక ముసలాయన మిత్రుడి దగ్గరికొచ్చి సలహా అడిగాడు.

"రవ్వలాంటి పిల్లని చూశాను. పెళ్ళి చేసుకోవాలని మనసు రెపరెపలాడుతోంది. నేను ధనికుణ్ణని ఆమెకు తెలుసు. రేపు మీ వయసెంత అని ఆ పిల్ల అడిగితే అరవయ్యి అని నిజం చెప్పమంటావా లేక ఒక పదేళ్ళు తగ్గించి చెప్పనా?"

మిత్రుడు ఒక క్షణం ఆలోచించి–

"రెండూ వద్దు. ఎనభయి ఏళ్ళని చెప్పు. అలా అంటే నువ్వు త్వరగా బాల్చీ తన్నేస్తావు. నీ ఆస్తి తనకు సంక్రమిస్తుందని ఆ పిల్ల తక్షణం ఒప్పుకుంటుంది."

పెద్ద ఫ్యాన్సీ షాపుకెళ్ళి, రెండు రూపాయలు ఖరీదు చేసే చుట్టకొని వెలిగించి ఘరానాగా పొగ వదులుతున్నాడు ఒక ఆసామి.

ఆ వాసన భరించలేక పోయారు షాపులో ఉన్న మిగతా వాళ్ళు. కొట్టు యజమాని వచ్చి చెప్పాడు.

"ఇక్కడ చుట్టలు కాల్చకూడదు. దయచేసి.."

"మీ కోట్లోనే కొన్నానయ్యా రెండు రూపాయలు పోసి."

"చిత్తం.మేము విరోచనాల మాత్రలు కూడా అమ్ముతాము. అందుకని..."

రుసరుసలాడుతూ బయటకి నడిచాడు ధూమపానీయుడు.

"మన బాస్ నన్ను పెళ్ళిచేసుకోమని అడిగాడు."

"అంతకంటే ఏం కావాలి? నువ్వు చాలా అదృష్టవంతురాలివి."

"అవుననుకో. కాని ఇంతకు ముందు మూణ్ణెల్లు జీతంతో సెలవిస్తానన్నాడు. ప్రమోషనిచ్చి రెండు వందల జీతం పెంచుతానన్నాడు. ఇప్పుడవన్నీ ఏమయిపోతాయని ఆలోచిస్తున్నా."

ఒక ఆధునిక యువకుడి గుణగణాలను బేరీజు వేసుకునింటున్నాడు తన పిల్లనిద్దామని వచ్చిన పెద్దమనిషి.

"ఉదయం ఎప్పుడు లేస్తావు బాబూ?"

"సూర్యకిరణాలు కిటికీలో నుంచి అలా పడడం ఆలస్యం ఠక్కున లేచిపోతాను."

"ఈ కాలంలో పెదలాడే లేచే కుర్రాళ్ళు అరుదుగా ఉంటారు."

"అవుననుకోండి.. నా గదిలో కిటికీ పడమటవైపున ఉంది."

“నువ్వు నిజంగా హత్య జరగడం చూశావా?” అడిగాడు జడ్జి.

"లేదు కాని తుపాకి గుండు శబ్దం విన్నాను" అన్నాడు సాక్షి.

"వినికిడి సాక్ష్యాలను కోర్టు పరిగనకు తీసుకోదు" అని కొట్టేశారు జడ్జి.

సాక్షి దిగి వెళ్ళిపోతున్నాడు. అతని వెనుక భాగం మాత్రమే కనపడుతోంది జడ్జికి. వెళ్తూ సాక్షి గట్టిగా నవ్వి, 'పిచ్చి ముండా కొడుకు ' అని వ్యాఖ్యానించాడు.

జడ్జికి కోపంతో ఒళ్ళు రగిలిపోయింది. సాక్షిని వెనక్కు పిలిచి అడిగాడు.

"ఏమన్నావు?"

"ఏమీ అనలేదు."

"నేను స్వయంగా విన్నాను" గర్జించాడు జడ్జీ.

"వినికిడి సాక్ష్యాలు కోర్టువారు పరిగణనలోకి తీసుకోకూడదుకదండీ"

"వాడుట్టి పనికిమాలిన సన్యాసి పొద్దుటనుంచి చీకటి పడేదాకా అక్కడే కూర్చుని దిక్కులు చూస్తున్నాడు."

"నీకెలా తెలుసు?"

"నేను వాణ్ణి కనిపెడుతూనే ఉన్నాను పొద్దుటనుంచి."

COMMENTS